# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY


5 

తమిళనాడు

TAMILNADU

శనివారం 1 జూన్ 2024




తిరువళ్లువర్ విగ్రహాన్ని పరికిస్తూ..

# త్రివేణి సంగమ తీరంలో మోదీ ధ్యానం

● కాషాయ దుస్తులు, రుద్రాక్ష మాల ధరించిన ప్రధాని ● నేటి సాయంత్రం వరకు మౌనదీక్ష



ధ్యానంలో మోదీ





సూర్య నమస్కారం ..

చెన్నై, మే 31 (ఆంధ్రజ్యోతి): త్రివేణి సంగమ తీరాన ప్రధానమంత్రి నరేంద్రమోదీ ధ్యానముద్రలో మునిగితేలారు. కాషాయ దుస్తులు, రుద్రాక్షమాల ధారణ, నుదుట విభూతి రేఖలు, వాటి మధ్య కుంకుమ బొట్టుతో సాధు పుంగవుని తలపించేలా ప్రధాని ధ్యానం ప్రారంభించారు. గత కొన్నాళ్లుగా ఎన్నికల ప్రచారంలో తలమునకలై వున్న ఆయన.. ప్రశాంతత కోసం కన్నియాకుమారిలోని వివేకానంద స్మారకమండపాన్ని ఎన్నుకున్న విషయం తెలిసిందే. ఇందుకోసం గురువారం సాయంత్రం 6 గంటలకు స్మారకమండపం చేరుకున్న మోదీ ధ్యానం ప్రారంభించారు. అది మొదలు ఆయన వంతుల వారీగా ధ్యానం చేపట్టారు. శుక్రవారం వేకువజామున స్నానపానాదాలు ముగించి, స్మారక మండపంలోని ధ్యానమందిరం నుంచి పవిత్రజలాల కమండలంతో బయటకుకు వచ్చారు. జప మాల తిప్పుతూ, మంత్రోచ్చారణ చేస్తూ వివేకానంద స్మారక మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. ఆ తర్వాత మండపం తూర్పు దిశగా ఉన్న ప్రాంతానికి చేరుకుని సూర్య నమస్కారం చేశారు. అంతేగాక తన కమండలంలోని గంగాజలాన్ని సముద్రంలో కలిపారు. ఈ సందర్భంగా ఆయన త్రివేణి సంగమ అద్భుతాన్ని, సాగర తీరాన్ని తిలకించారు. అక్కడి నుంచి తిరువళ్లువర్ విగ్రహాన్ని పరికించారు. అనంతరం మళ్లీ స్మారకమందిరంలోకి వెళ్లి ధ్యానం చేపట్టారు. మోదీ ధ్యానంతో పాటు మౌనవ్రతం కూడా పాటిస్తున్నారు. శనివారం సాయంత్రం మూడు గంటల వరకు ఆయన మౌనవ్రతాన్ని కొనసాగించనున్నారు. మోదీ పర్యటన సందర్భంగా ఆ చుట్టుపక్కల ప్రాంతాల్లో పటిష్ఠమైన భద్రత ఏర్పాటు చేశారు.

# మండుతున్న ఎండలు!

● పాఠశాలల పునఃప్రారంభం మళ్లీ వాయిదా

● 10వ తేదీన తెరుచుకోనున్న బడులు



పెరంబూర్, మే 31: రాష్ట్రంలో పాఠశాలల పునఃప్రారంభం మళ్లీ వాయిదా పడింది. ఈ నెల 6కు బదులుగా 10వ తేదీ పునఃప్రారంభమవుతాయని విద్యాశాఖ ప్రకటించింది. సాధారణంగా పాఠశాల విద్యార్థులకు మే నెలలో వేసవి సెలవులు ప్రకటించి జూన్ మొదటి వారం నుంచి పాఠశాలలు ప్రారంభిస్తుంటారు. కానీ, లోక్‌సభ ఎన్నికల లెక్కింపు ఈ నెల 4వ తేదీ జరుగనున్న నేపథ్యంలో, 6వ తేది నుంచి పాఠశాలలు ప్రారంభమవుతాయని పాఠశాల విద్యాశాఖ ప్రకటించింది. ఈ క్రమంలో, రాష్ట్రంలో చెన్నై సహా పలు జిల్లాల్లో ఎండ తీవ్రత అధికంగా ఉండడం, రాబోయే రోజుల్లోనూ పగటి ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశముందని వాతావరణ కేంద్రం ప్రకటించడంతో విద్యార్థుల ఆరోగ్యాన్ని పరిగణనలోకి తీసుకొని పాఠశాలల ప్రారంభం వాయిదావేయాలని పలు పార్టీల నేతలు, విద్య, ఆరోగ్య శాఖల నిపుణులు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో, ఎండ తీవ్రత అధికంగా ఉన్న కారణంగా పాఠశాలల ప్రారంభం వాయిదావేస్తున్నట్లు విద్యాశాఖ ప్రకటించింది. ఇదివరకు ప్రకటించినట్లుగా 6న కాకుండా 10వ తేదీన పాఠశాలలు ప్రారంభమవుతాయని పేర్కొంది. కాగా, కేంద్ర పాలిత రాష్ట్రం పుదుచ్చేరీలో కూడా జూన్ 12 ^ంచి పాఠశాలలు ప్రారంభమవుతాయని ఆ రాష్ట్రప్రభుత్వం శుక్రవారం ప్రకటించిన విషయం తెలిసిందే.

# విద్యుత్ రంగంలో విశిష్ట సంస్కరణలు

● ప్రభుత్వ చర్యలతో విద్యుదుత్పత్తిలో ముందడుగు

ప్యారీస్, మే 31: ముఖ్యమంత్రి స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే ప్రభుత్వం ముందుచూపుతో రాష్ట్రంలో విద్యుత్‌కోతలకు తావు లేకుండాపోయింది. రాష్ట్రంలో విద్యుదుత్పత్తి కోసం ప్రభుత్వం కల్పించిన సౌకర్యాల కారణంగా థర్మల్ కేంద్రాల్లో ఉత్పత్తి గణనీయంగా పెరిగిందని, ఈ విషయంలో దేశంలోని ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచిందని రాష్ట్రప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ప్రభుత్వం శుక్రవారం ప్రకటన విడుదల చేసింది. దివంగత ముఖ్యమంత్రి కరుణానిధి 1974వ సంవత్సరంలో రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చి దేశంలోనే తొలిసారిగా అన్ని గ్రామాలకు విద్యుత్ సరఫరా చేసిన రాష్ట్రంగా తమిళనాడును నిలిపారు. 1990లో రైతుల ఆర్థిక వ్యవస్థను మెరుగుపరచాలన్న ధృక్పథంతో వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చి వ్యవసాయ ఉత్పత్తులు పెరిగేందుకు కరుణానిధి కృషిచేశారని, ఆయన మార్గంలోనే ముఖ్యమంత్రి స్టాలిన్ కూడా విద్యుత్ సంస్కరణలపై ప్రత్యేక దృష్టి సారించారని ప్రభుత్వం పేర్కొంది. 2021లో ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన స్టాలిన్.. ప్రజలకు ద్రావిడ తరహా పాలన అందిస్తున్నారని, విద్యుదుత్పత్తి కోసం పలు కొత్త పథకాలను రూపొందిస్తున్నారని, డీఎంకే ప్రభుత్వ మూడేళ్ల పాలనలో సుమారు 2 లక్షల మంది రైతులకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చినట్లు పేర్కొంది. అధికారం చేపట్టిన 2021వ సంవత్సరం 32,595 మెగావాట్లున్న విద్యుదుత్పత్తి సామర్థ్యం ప్రస్తుతం 36,671 మెగావాట్లకు పెరిగింది. అంతేకాకుండా, 3,984 మెగావాట్ల సామర్థ్యం కలిగిన పవన విద్యుత్ కేంద్రాల్లో ఆధునిక వసతుల కల్పన కారణంగా ప్రస్తుతం 8,496 మెగావాట్లకు ఉత్పత్తి పెరిగింది. 2021-22వ సంవత్సరాల్లో భవనాల పైకప్పులపై సౌరవిద్యుత్ సదుపాయం కల్పించిన సంస్థలను ప్రోత్సహించేలా కేంద్ర ఇంధన శక్తి మంత్రిత్వ శాఖ రాష్ట్రప్రభుత్వాన్ని ప్రశంసిస్తూ రూ.7.9 కోట్ల ప్రోత్సాహక నిధి అందచేసింది. ధర్మపురిలో 12 మెగావాట్లు, ఎమ్మార్ కృష్ణమూర్తి సహకార చక్కెర ఫ్యాక్టరీలో 15 మెగావాట్ల సామర్థ్యం కలిగిన విద్యుత్ పథకాలను ముఖ్యమంత్రి స్టాలిన్ ప్రారంభించారు. రాష్ట్రంలో ప్రైవేటు సంస్థలకు చెందిన ఉపయోగంలో లేని 16.8 మెగావాట్ల పవన విద్యుత్ కేంద్రాలను మళ్లీ పనిచేసేలా ద్రావిడ మోడల్ ప్రభుత్వం చర్యలు చేపట్టిందని, రాష్ట్ర ప్రజలను కోత లేని విద్యుత్ సరఫరా చేయాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం ముందు చూపుతో వ్యవహరిస్తోంది. రాష్ట్రంలో ప్రభుత్వ నిర్వహణలో ఉన్న థర్మల్ విద్యుత్ కేంద్రాలకు అవసరమైన బొగ్గు సకాలంలో సరఫరా చేసేందుకు తూత్తుకుడి హార్బర్ ప్రాంగణంలో ప్రత్యేక టెర్మినల్ ముఖ్యమంత్రి స్టాలిన్ 2023 జనవరి 31న ప్రారంభించారు. ఉత్తర చెన్నై థర్మల్ విద్యుత్ కేంద్రంలో మూడో పథకాన్ని మార్చి 7వ తేది సీఎం ప్రారంభించారు. ఈ కేంద్రంలో 70.5 మిలియన్ యూనిట్ విద్యుదుత్పత్తి కాగా, ఈ కేంద్రంలోని మిగతా ప్లాంట్లలో ఎలాంటి అవాంతరాలు లేకుండా పనిచేసేందుకు ప్రభుత్వం అవసరమైన నిధులు కూడా కేటాయించింది. 2021వ సంవత్సరం నుంచి 54 కొత్త సబ్ విద్యుత్ కేంద్రాలు 10,779 ఎంవీఏ సామర్థ్యంతో పనిచేస్తున్నాయి. 9 ప్రధాన సబ్ విద్యుత్ కేంద్రాల్లో విద్యుదుత్పత్తికి ఎలాంటి అంతరాయం లేకుండా 1,840 మెగావాట్ సామర్థ్యం కలిగిన రియాక్టర్లను పొందుపరిచారు. తంజావూరు, తిరువణ్ణామలై, కరూర్ ప్రాంతాలను కేంద్రాలుగా మరో మూడు కొత్త విద్యుత్ మండలాలను రాష్ట్ర విద్యుత్ బోర్డు పరిచయం చేసింది. డెల్టా జిల్లాల్లో సముద్రతీరాల్లో ఉన్న విద్యుత్ కేంద్రాల మధ్య హై ఓల్టేజీ వైర్లను అండర్ గ్రౌండ్ కేబుల్స్ మార్చడం వల్ల ఈ ప్రాంతాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరా కొనసాగుతుందని ప్రభుత్వం తెలిపింది. 2022 సెప్టెంబరు 10వ తేది నుంచి సవరించిన విద్యుత్ ఛార్జీల్లో ఇంటి విద్యుత్ కనెక్షన్‌దారులకు రెండు నెలలకు సర్వీస్ ఫీజులో రూ.20 నుంచి రూ.50 వరకు రాయితీ కల్పించారు. చేనేత కార్మికులకు రెండు నెలలకు 200 యూనిట్లు మాత్రమే ఉచిత కరెంట్ అన్న పరిస్థితి మార్పు చేసి ప్రస్తుతం 300 యూనిట్లకు పెంచడం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 72,643 మంది లబ్ధిపొందుతున్నారు. అదే విధంగా మరమగ్గాలకు రెండు నెలలకు కల్పించిన 750 యూనిట్ల ఉచిత కరెంట్‌ను 1,000 యూనిట్లకు పెంచారు.



ఉత్తర చెన్నైలో ఏర్పాటు చేసిన విద్యుత్ ప్లాంట్‌ను సీఎం స్టాలిన్ ప్రారంభించినప్పటి దృశ్యం

## శ్రీవారి సేవలో సీఎస్



తిరుమల శ్రీవారి ఆలయం ముందు చీఫ్ సెక్రటరీ శివదాస్ మీనా

తిరుమల, మే31(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి దర్శించుకున్నారు. చీఫ్ సెక్రటరీ శివదాస్ మీనా ఉదయం స్వామి దర్శనానికి రాగా ఆలయ అధికారులు స్వాగతం పలికి ప్రత్యేక దర్శనం కల్పించి లడ్డూప్రసాదాలు అందజేశారు.

# కేంద్ర పథకాలకు డీఎంకే స్టిక్కర్లు

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ఆరోపణ



నాగనాథస్వామిని దర్శించుకుంటున్న అన్నామలై

పెరంబూర్, మే 31: కేంద్ర ప్రభుత్వ పథకాలకు డీఎంకే ప్రభుత్వం స్టిక్కర్లు వేసుకుంటోందని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై ఆరోపించారు. "డీఎంకే అధికారం చేపట్టి మూడేళ్లు గడిచినా రాష్ట్రాభివృద్ధి, రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం ఎలాంటి పథకాలు అమలుచేసిన దాఖలాలు లేవు. ఎన్నికల హామీలు పూర్తిగా నెరవేర్చకుండా, కేవలం ప్రకటనలకు మాత్రమే పరిమితం కావడంతో పాటు, కేంద్ర పథకాలకు తమ స్టిక్కర్లు వేసుకొనే పరిస్థితులు సీఎం స్టాలిన్ నేతృత్వంలో సాగుతున్నాయి. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న సమగ్ర శిక్ష పథకంలో మూడేళ్లలో రాష్ట్రప్రభుత్వానికి రూ.5,858.32 కోట్ల నిధులు అందజేసింది. ఈ పథకాన్ని తమ ప్రభుత్వ పథకంగా సీఎం స్టాలిన్ ప్రకటనలు గుప్పిస్తున్నారు. ఈ పథకంలో పాఠశాలల్లో స్మార్ట్ తరగతుల ఏర్పాటుకు రూ.1,000 కోట్ల ఒప్పందాలను రాష్ట్రప్రభుత్వ సంస్థ ఎల్కాట్‌కు అప్పగించకుండా, కేరళ రాష్ట్ర ప్రభుత్వ సంస్థ కెల్ట్రాన్‌కు అప్పగించడంపై ముఖ్యమంత్రి వివరణ ఇస్తారా?" అంటూ అన్నామలై ప్రశ్నించారు.

### సీర్గాళి నాగనాదస్వామి ఆలయంలో పూజలు

మైలాడుదురై జిల్లా సీర్గాళి సమీపం కీళ్‌పెరుమ్‌పల్లం గ్రామంలోని నాగనాథస్వామి ఆలయాన్ని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై శుక్రవారం ఉదయం సందర్శించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. నవగ్రహ ఆలయాల్లో కేతు భగవానుడి క్షేత్రంగా కీర్తిగడించిన ఈ ఆలయానికి వెళ్లిన అన్నామలై, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కరుప్పు మురుగానందం ప్రార్థన చేశారు. ముందుగా అన్నామలైకి ఆలయ నిర్వాహకులు స్వాగతం పలికారు. ఆలయ నిర్వాహకులు ఆయనకు తామర పుష్పాల మాల వేసి పరివట్టం కట్టి సత్కరించారు.

## 'పోలీస్ స్టార్ ఆఫ్ ది మంత్'కు పళనిస్వామి ఎంపిక

పెరంబూర్, మే 31: 'పోలీస్ స్టార్ అవార్డ్ ఆఫ్ ఫిబ్రవరి-2024' పురస్కారానికి కేకే నగర్ ఎస్ఐ ఆర్.పళనిస్వామి ఎంపికయ్యారు. నగర పోలీసు శాఖలో విధి నిర్వహణలో అంకిత భావంతో పనిచేసిన అధికారులు, సిబ్బందిని ప్రతి నెలా ఎంపిక చేసి పురస్కారాలు అందజేసి, వారిని ప్రోత్సహించాలని నగర పోలీస్ కమిషనర్ సందీప్ రాయ్ రాథోడ్ నిర్ణయించారు. ఆ ప్రకారం, ఫిబ్రవరి నెలకు సంబంధించి కేకే నగర్ ఎస్ఐ పళనిస్వామి పురస్కారానికి ఎంపిక కాగా, వెప్పేరిలోని తన కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఎస్ఐ పళనిస్వామికి రూ.5,000 నగదు, ప్రశంసాపత్రాన్ని పోలీస్ కమిషనర్ సందీప్ రాయ్ రాథోడ్ అందజేశారు. కాగా, కేకే నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2018లో ఓ కళాశాల విద్యార్థిని హత్య కేసుకు సంబంధించిన ఆధారాలు సమర్పించడంలో ఎస్ఐ కృషిచేశారు. ఈ కేసులో నిందితుడికి యావజ్జీవ శిక్ష విధిస్తూ ఈ ఏడాది ఫిబ్రవరి 29న మహిళా కోర్టు తీర్పు వెలువరించింది.



ఎస్ఐ పళనిస్వామికి పురస్కారం అందజేస్తున్న పోలీస్ కమిషనర్ సందీప్‌రాయ్ రాథోడ్

## పాఠశాల విద్యార్థులకు కొత్త యూనిఫాం



చెన్నై, మే 31 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో పాఠశాలల విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులకు దీటైన యూనిఫాం పంపిణీ చేయడానికి అధికారులు సిద్ధమవుతున్నారు. ప్రభుత్వ, కార్పొరేషన్, మున్సిపల్ పాఠశాలల్లో చదివే నిరుపేద విద్యార్థులకు ఏటా యూనిఫాం అందజేస్తుంటారు. పాఠ్యపుస్తకాలు, విద్యా ఉపకరణాలు, పాదరక్షలు కూడా ఉచితంగా అందిస్తున్నారు. ఈ యేడాది పాఠశాలలు పునఃప్రారంభమైన రోజునే వీటిని అందజేసేందుకు పాఠశాలల విద్యాశాఖ తగు ఏర్పాట్లు చేపడుతోంది. ఇప్పటికే పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు అన్ని పాఠశాలలకు సరఫరా అయ్యాయి. నగరంలోని ప్రభుత్వ పాఠశాలలు, కార్పొరేషన్ పాఠశాలల్లో రెండు లక్షలకు పైగా విద్యార్థులు చదువుతున్నారు. వీరికి కూడా పాఠశాలలు తెరచిన వెంటనే పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, విద్యా ఉపకరణాలను పంపిణీ చేయనున్నారు. ఈ యేడాది నగరంలోని కార్పొరేషన్ పాఠశాలల విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు ధరించే యూనిఫారంలకు దీటుగా కొత్త యూనిఫాం పంపిణీ చేయాలని కార్పొరేషన్ అధికారులు నిర్ణయించారు. ఈ సారి విద్యార్థుల కొలతలు తీసుకుని మరీ ఈ అందమైన యూనిఫాం తయారు చేస్తున్నారు. సామాజిక సంక్షేమ శాఖ ఏప్రిల్‌లో ఈ పనులన్నింటినీ పూర్తి చేసింది. ఆరు నుండి 12 తరగతుల విద్యార్థులకు షర్టు, ప్యాంట్, ఒకటి నుండి ఐదు వరకు చదివే విద్యార్థులు హాఫ్‌ప్యాంట్, షర్ట్ అందజేయనున్నారు. విద్యార్థినులకు సంబంధించి 1 నుండి 4 తరగతులవారికి స్కట్, షర్టు, ఐదో తరగతి విద్యార్థినులకు లంగా, చొక్కా, ఆరు నుండి ప్లస్-2 వరకు చదివేవారికి కోటుతో చుడీదార్ అందజేస్తారు.

### ఆధార్ శిబిరాలు..

రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలలు పునఃప్రారంభయ్యే రోజునే ఆధార్ కార్డ్ నమోదు శిబిరాలు ఏర్పాటుచేయాలని పాఠశాలల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు ఆ శాఖ కార్యదర్శి కుమార గురుబరన్ ఓ ప్రకటన జారీ చేస్తూ పాఠశాలల విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న ఉచిత పథకాల ద్వారా లబ్ధి పొందటానికి ప్రతి విద్యార్థికి ఆధార్‌కార్డ్ అవసరమని, ఆ మేరకు పాఠశాలలు తెరచిన రోజు ఆధార్ నమోదు శిబిరాలు నిర్వహించాలని తెలిపారు. ఇదే విధంగా ప్రైవేటు పాఠశాలలు కూడా ఆధార్ నమోదు శిబిరాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. 'చదివే పాఠశాలలోనే ఆధార్ నమోదు' అనే విశిష్టమైన ఈ ప్రభుత్వ పథకం విజయవంతానికి పాఠశాలల నిర్వాహకులు, ఉపాధ్యాయులు అన్ని విధాలా సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# సమాచార దర్శిని

## 'నీట్' కీ విడుదల

ఐసిఎఫ్, మే 31: జాతీయ పరీక్షా ఏజెన్సీ 'నీట్' జవాబుపత్రాల నకళ్లు, కీ విడుదల చేసింది. గత నెల 4వ తేది 4,750 పరీక్షా కేంద్రాల్లో నీట్ నిర్వహించగా, 24 లక్షల మంది విద్యార్థులు హాజరయ్యారు. గురువారం విద్యార్థుల జవాబుపత్రాల నకళ్లు, మార్కుల వివరాలు, కీ విడుదలైంది. ఇందులో ఏదైనా ఆక్షేపణ లుంటే శనివారం రాత్రి 11.50 గంటల్లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. ఇతర వివరాలకు జాతీయ పరీక్ష ఏజెన్సీ (ఎన్‌టీఏ) వెబ్‌సైట్ సంప్రదించవచ్చు.

## ఇంజనీరింగ్ కోర్సులకు 2.25 లక్షల మంది దరఖాస్తు

పెరంబూర్, మే 31: రాష్ట్రంలోని ఇంజనీరింగ్ కోర్సుల్లో ప్రస్తుత విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు 2.25 లక్షల మంది దరఖాస్తు చేశారు. అన్నా విశ్వవిద్యాలయ పరిధిలోని 460 ఇంజనీరింగ్ కళాశాలల్లో 2024-25 యూజీ మొదటి సంవత్సరం దరఖాస్తు స్వీకరణ గత నెల 6వ తేది ఆన్‌లైన్‌లో ప్రారంభమైంది. గురువారం సాయంత్రం వరకు 2,25,290 మంది దరఖాస్తు చేశారు. దరఖాస్తు స్వీకరణ తుది గడువు ఈ నెల 6వ తేది కావడంతో దరఖాస్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని అన్నా వర్సిటీ అధికారులు పేర్కొంటున్నారు.

## 12 బోగీలతో మెము రైళ్లు

ఐసిఎఫ్, మే 31: మెము రైళ్లను 12 బోగీలతో నడుపనున్నట్లు దక్షిణ రైల్వే అధికారులు తెలిపారు. కాట్పాడి-అరక్కోణం, చెన్నై బీచ్-మేల్‌మరువత్తూర్, తిరుత్తణి-సెంట్రల్, చిట్రగుంట-సెంట్రల్ సహా వివిధ మార్గాల్లో 12కు పైగా మెము రైళ్లు నడుస్తున్నాయి. 9 బోగీలు మాత్రమే ఉండడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ ఎక్కువగా ఉంటోంది. అలాగే, డోర్లు చిన్నవిగా ఉండంతో ఎక్కి, దిగేందుకు ప్రయాణికులు ఇబ్బందులకు గురవుతున్నారు. అదనపు బోగీలు అనుసంధానం చేయాలన్న ప్రయాణికుల విజ్ఞప్తిని పరిశీలించిన దక్షిణ రైల్వే, 12 బోగీలతో రైళ్లు నడిపేందుకు నిర్ణయించింది.

## 5 నుంచి జంతువులకు వ్యాక్సిన్ల శిబిరం

చెన్నై, మే 31 (ఆంధ్రజ్యోతి): 'సంచు యానిమల్ హాస్పిటల్' నిర్వాహకులు పెంపుడు జంతువుల కోసం ప్రత్యేక వ్యాక్సిన్ల శిబిరం చేపట్టనున్నారు. ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు జరుగనున్న ఈ శిబిరానికి యజమానులు రోజూ ఉదయం 10నుంచి సాయంత్రం 8గంటల వరకు తమ పెంపుడు జంతువులను తీసుకురావచ్చు. దీనికయ్యే వ్యయంలో 50 శాతం రాయితీ కల్పించనున్నట్లు నిర్వాహకులు విడుదల చేసిన ప్రకటనలో పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 9355053890 మొబైల్ నెంబరులో సంప్రదించవచ్చు.

## నాలుగు జిల్లాల్లో కార్చిచ్చు

ఐసిఎఫ్, మే 31: దిండుగల్, తిరుచ్చి, చెంగల్పట్టు, కాంచీపురం జిల్లాల్లో గురువారం కార్చిచ్చు ఏర్పడినట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో మళ్లీ కార్చిచ్చు సంఘటనలు అధికమవుతున్నాయి. గురువారం సాయంత్రం దిండుగల్ జిల్లా పళని, తిరుచ్చి జిల్లా ఏవూర్, చెంగల్పట్టు జిల్లా మధురాంతకం, కాంచీపురం జిల్లా శ్రీపెరుంబుదూర్ తదితరప్రాంతాల్లో ఏర్పడిన కార్చిచ్చు ఆర్పేందుకు చర్యలు చేపట్టినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు.

## కార్పొరేషన్ ఇంజనీర్ సస్పెన్షన్

ఐసిఎఫ్, మే 31: నాగర్‌కోయిల్ కార్పొరేషన్ ఇంజనీర్ సస్పెన్షన్‌కు గురయ్యారు. నాగర్‌కోయిల్ కార్పొరేషన్ ఇంజనీర్ బాలసుబ్రమణియన్, నాగర్‌కోయిల్ మున్సిపాలిటీగా ఉన్నప్పటి నుంచే ఆయన అక్కడ పనిచేస్తున్నారు. శుక్రవారం ఆయన పదవీవిరమణ చేయాల్సి ఉండగా, హఠాత్తుగా ఆయనను సస్పెండ్ చేస్తూ చెన్నై అధికారులు ఉత్తర్వులు జారీచేశారు. ఆయనపై వివిధ ఫిర్యాదులున్నాయని, వాటి ఆధారంగా సస్పెండ్ చేసినట్లు అధికారులు తెలిపారు.

## పశ్చిమ అరేబియా సముద్రంలో చేపల వేట నిషేధం

పెరంబూర్, మే 31: కన్నియాకుమారి జిల్లాలోని పశ్చిమ అరేబియా సముద్ర ప్రాంతంలో చేపల వేట నిషేధ కాలం శుక్రవారం అర్ధరాత్రి నుంచి అమలుకానుంది. చేపల వేట నిషేధంతో వందలాది మంది జాలర్లు తీరానికి చేరుకొని తమ పడవలను తీరంలో నిలిపారు. ఇప్పటికే చేపల వేటకు వెళ్లిన వారు అర్ధరాత్రిలోగా తీరానికి తిరిగొస్తారని, 60 రోజులు నిషేధ కాలం ఉంటుందని మత్స్యశాఖ అధికారులు తెలిపారు.

## వడదెబ్బకు విద్యార్థి మృతి

పెరంబూర్, మే 31: స్థానిక తిరునింద్రవూర్‌లో వడదెబ్బకు ప్లస్ టూ విద్యార్థి మృతిచెందాడు. మూడు రోజులుగా నగరం, శివారు ప్రాంతాల్లో ఎండ తీవ్రత అధికంగా ఉంటోంది. రాష్ట్రంలోనే అత్యధిక ఉష్ణోగ్రతలు నుంగంబాక్కంలో నమోదవుతున్నాయి. ఎండ తీవ్రత, వేడిగాలులకు ప్రజలు ఉక్కపోతతో అల్లాడుతున్నారు. ఈ నేపథ్యంలో, తిరునింద్రవూర్‌కు చెందిన విద్యార్థి శక్తి శుక్రవారం తన స్నేహితుడు హరిసుధన్ ఇంటికెళ్లాడు. ఎండలో వచ్చిన శక్తి హఠాత్తుగా స్పృహ తప్పి కింద పడిపోయాడు. చుట్టుపక్కల వారు వెంటనే సమీపంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే అతను మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఆ ఘటనపై పోలీసులు విచారణ చేపట్టారు.

## 100 సవర్ల నగలు చోరీ

ఐసిఎఫ్, మే 31: కారైక్కుడి ఆయిల్ సంస్థ అధికారి ఇంట్లో 100 సవర్ల నగలు చోరీకి గురయ్యాయి. విరుదునగర్ జిల్లా రాజపాళయం భారతి నగర్ ప్రాంతానికి చెందిన గణేశన్ (50) శివగంగ జిల్లా కారైక్కుడిలో ఉన్న ఆయిల్ సంస్థలో అధికారిగా పనిచేస్తున్నారు. ఈ నేపథ్యంలో, చెన్నైలో శనివారం బంధువుల ఇంటిలో జరిగే కార్యానికి కుటుంబ సమేతంగా ఇంటికి తాళం వేసి వెళ్లారు. శుక్రవారం ఉదయం రాజపాళయంలో ఆయన ఇంటి తాళాన్ని గుర్తుతెలియని వ్యక్తులు పగులగొట్టి బీరువాలో ఉన్న 100 సవర్ల నగలు, నగదు అపహరించుకు వెళ్లారు. ఈ ఘటనపై రాజపాళయం సౌత్ పోలీసులు కేసు నమోదుచేసి విచారణ జరుపుతున్నారు.

## కొత్త గుంటూరు వెళ్లని జనశతాబ్ది

పెరంబూర్, మే 31: గుంటూరు-కృష్ణా కెనాల్ మధ్య మరమ్మతు కారణంగా పలు రైళ్లు కొత్త గుంటూరు వెళ్లవని దక్షిణ రైల్వే ఒక ప్రకటనలో తెలిపింది. ఆ ప్రకారం, నెం.12077 డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-విజయవాడ, నెం.16031 డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-శ్రీ వైష్ణోదేవి కత్రా అండమాన్ ఎక్స్‌ప్రెస్, నెం.16093 డా.ఎంజీఆర్ చెన్నై సెంట్రల్-లక్నో ఎక్స్‌ప్రెస్ రైళ్లు ఈ నెల 1 నుంచి 14వ తేది వరకు తెనాలి, దుగ్గిరాల, కృష్ణా కెనాల్ మీదుగా మళ్లించడంతో ఈ రైళ్లు కొత్త గుంటూరు వెళ్లవని దక్షిణ రైల్వే తెలియజేసింది.

## పుస్తకాలు స్వయంగా తీసుకెళ్తున్న ఉపాధ్యాయులు

పెరంబూర్, మే 31: వేసవి సెలవుల అనంతరం ఈ నెల 6 నుంచి పాఠశాలలు ప్రారంభమవుతున్నాయి. ప్రారంభం రోజునే విద్యార్థులకు పాఠ్య, నోటు పుస్తకాలు అందించాలని పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది. ఈ నేపథ్యంలో, జిల్లా విద్యాశాఖ కార్యాలయాల్లో ఉన్న పాఠ్య, నోటు పుస్తకాలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు వచ్చి తీసుకెళ్తున్నారు. 1 నుంచి 8వ తరగతి వరకు 1వ సెమిస్టర్ పుస్తకాలు, 9 నుంచి ప్లస్ టూ తరగతి వరకు పూర్తి సిలబస్ పుస్తకాలను విద్యార్థులకు అందజేస్తున్నట్లు అధికారులు తెలిపారు.


తిరుప్పూర్ జిల్లాలో పుస్తకాలు తీసుకుంటున్న ఉపాధ్యాయులు

# ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్ ఏడీఎస్పీ సస్పెన్షన్

చెన్నై, మే 31 (ఆంధ్రజ్యోతి): ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గా పేరుపొందిన ఏడీఎస్పీ వెళ్లైదురైని సస్పెండ్ చేస్తూ హోంశాఖ కార్యదర్శి అముదా శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. వెళ్లై దురై శుక్రవారం పదవీ విరమణ చేయనున్న సందర్భంలో సస్పెన్షన్ ఉత్తర్వు అందుకున్నారు. 1997లో పోలీసు శాఖలో చేరిన వెళ్లైదురై చందనపు చెక్కల స్మగ్లర్ వీరప్పన్‌ను హతమార్చిన ప్రత్యేక దళంలో సభ్యుడిగా పని చేసి రెండు పదోన్నతులు కూడా పొందారు. ఆ తర్వాత చెన్నైలో పేరుమోసిన రౌడీ అయోధ్యకుప్పం వీరమణి సహా పలువురు రౌడీలను ఎన్‌కౌంటర్ చేసి ఎన్‌కౌంటర్ స్పెషలిస్ట్‌గా పేరుగడించారు. ప్రస్తుతం తిరువణ్ణామలై జిల్లా నేరాల విభాగం రికార్డుల విభాగం ఏడీఎస్పీగా పనిచేస్తున్నారు. 2013లో శివగంగలో రాము అలియాస్ కొక్కి కుమార్ అనే వ్యక్తి కస్టడీలో మృతి చెందిన కేసులో ఏడీఎస్పీ వెళ్లైదురై నిందితుడిగా ఉన్నారు. ప్రస్తుతం ఆ కేసు ప్రకారమే ఆయనను శుక్రవారం సాయంత్రం పదవీ విరమణ చేయనున్న తరుణంలో సస్పెండ్ చేశారు.


ఏడీఎస్పీ వెల్లదురై

## ఇద్దరు దోపిడీ దొంగల అరెస్ట్


పోలీసులకు పట్టుబడిన దొంగలు

వేలూరు, మే 31: వేలూరు తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగతనాలు, దోపిడీలు అరికట్టాలని ఎస్పీ మణివన్నన్ ఉత్తర్వులు జారీచేశారు. దీంతో, వేలూరు ఏడీఎస్పీ తిరునావుక్కరసు సలహా మేరకు సీఐ శుభ నేతృత్వంలో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో, దోపిడీలకు పాల్పడున్న మారిముత్తు, రాజేంద్రన్‌లను అరెస్ట్ చేసిన పోలీసులు, వారి నుంచి 5 సవర్ల నగలు, 350 గ్రాముల వెండి, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. వీరిపై మరో పోలీస్‌స్టేషన్‌లో కూడా కేసు ఉన్నట్లు తెలుసుకున్న పోలీసులు వారిని కోర్టులో హాజరుపరచి జైలుకు తరలించారు.

## రెండు రైళ్లలో ఇద్దరు ప్రయాణికుల మృతి

పెరంబూర్, మే 31: కోయంబత్తూర్ వచ్చిన రెండు ఎక్స్‌ప్రెస్ రైళ్లలో తలా ఒకరు మృతిచెందారు. తిరువారూర్ జిల్లా మన్నార్‌గుడి నుంచి కోవైకు సెమ్మొళి ఎక్స్‌ప్రెస్ గురువారం ఉదయం 5.30 గంటలకు కోవై రైల్వేస్టేషన్ సమీపిస్తున్న సమయంలో అందులో ప్రయాణిస్తున్న మన్నార్‌గుడి సమీపం సేందమంగళం ప్రాంతానికి చెందిన ఖాజా(52) హఠాత్తుగా తీవ్ర అస్వస్థతకు గురై మృతిచెందాడు. అలాగే, తిరువంతపురం నుంచి బెంగళూరు వెళుతున్న ఐల్యాండ్ ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణిస్తున్న పశ్చిమబెంగాల్‌కు చెందిన ఓ ప్రయాణికురాలు కోవై రైల్వేస్టేషన్ సమీపిస్తున్న తరుణంలో హఠాత్తుగా అస్వస్థతకు గురై మృతిచెందింది. ఈ ఘటనపై కోవై రైల్వే పోలీసులు విచారణ చేపట్టారు.

## మరో 248 ఎంటీసీ బస్సులకు ఆటోమేటిక్ డోర్లు

పెరంబూర్, మే 31: మెట్రోపాలిటన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఎంటీసీ) రెండో విడతగా 248 బస్సులకు ఆటోమేటిక్ డోర్లు ఏర్పాటుచేసింది. ఈ మేరకు ఎంటీసీ తన 'ఎక్స్' పేజీలో... ప్రయాణికుల భద్రతకు ఎంటీసీ పలు చర్యలు చేపట్టింది. అందులో ఒక బాగంగా ఎంటీసీ బస్సుల్లో ఆటోమేటిక్ డోర్లు ఏర్పాటుచేయాలని నిర్ణయించింది. మొత్తం 468 బస్సులకు ఆటోమేటిక్ డోర్లు లేవని గుర్తించి, తొలివిడతగా 200 బస్సుల్లో ఈ డోర్లు ఏర్పాటుచేశారు. రెండో విడతగా మరో 248 బస్సులకు ఆటోమేటిక్ డోర్లు ఏర్పాటుచేసినట్లు ఎంటీసీ తెలియజేసింది.

## లైసెన్స్ లేకుండా తల్లిపాల విక్రయం

● మందుల దుకాణానికి సీలు

చెన్నై, మే 31 (ఆంధ్రజ్యోతి): స్థానిక మాధవరంలో లైసెన్స్ లేకుండా తల్లిపాలను విక్రయిస్తున్న ఓ మందుల దుకాణానికి ఆహార భద్రతా విభాగం అధికారులు సీలుపెట్టారు. మాధవరం కేకేఆర్ గార్డెన్ ప్రాంతంలో సెంబియన్ ముత్తయ్యా అనే వ్యక్తి మందుల దుకాణం నడుపుతున్నారు. ఆ దుకాణంలో చట్ట విరుద్ధంగా ప్లాస్టిక్ సీసాల్లో తల్లిపాలను నిల్వ ఉంచి విక్రయిస్తున్నారు. ఈ సమాచారం తెలుసుకుని ఆహార భద్రతా విభాగం అధికారి కస్తూరి ఇతర సిబ్బందితో వెళ్ళి ఆ మందుల దుకాణంలో తనిఖీలు జరిపారు. ఆ తనిఖీల్లో రెఫ్రిజిరేటర్‌లో భద్రపరచిన 200 సీసాల తల్లిపాలను స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాత ఆదుకాణాన్ని మూసివేసి అధికారులు సీలు పెట్టారు.

## రూ.4 కోట్ల స్వాధీనం కేసు....

సీబీసీఐడీ విచారణకు నయినార్ నాగేంద్రన్ గైర్హాజరు

చెన్నై, మే 31 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల సందర్భంగా తాంబరం రైల్వేస్టేషన్ వద్ద రూ.4 కోట్ల నగదు పట్టుబడిన కేసులో తిరునల్వేలి బీజేపీ అభ్యర్థి నయినార్ నాగేంద్రన్‌సహా నలుగురు సీబీసీఐడీ పోలీసుల విచారణకు గైర్హాజరయ్యారు. మార్చి 26న తాంబరం రైల్వేస్టేషన్ నుంచి తిరునల్వేలికి రైలులో తరలిస్తున్న నగదును ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. దానికి సంబంధించి నయినార్ నాగేంద్రన్‌కు చెందిన హోటళ్లలో పనిచేసే ముగ్గురిని అరెస్టు చేశారు.. ఈ ఘటనపై సీబీసీఐడీ పోలీసులు పలుమార్లు నయినార్ నాగేంద్రన్‌కు సమన్లు పంపినా విచారణకు హాజరుకాలేదు. ఇదే విధంగా శుక్రవారం నయినార్ నాగేంద్రన్ సహా నలుగురు సీబీసీఐడీ పోలీసులు ఎదుట విచారణకు హాజరుకావాల్సి ఉంది. అయితే తాము జూన్ నాలుగు తర్వాత విచారణకు హాజరవుతామంటూ నయినార్‌నాగేంద్రన్ తరపు న్యాయవాదులు సీబీసీఐడీ పోలీసులకు తెలిపారు.

## లేడీస్ హాస్టల్ ఎదురుగా నగ్నంగా నిలబడిన యువకుడి అరెస్టు

అడయార్, మే 31: వైద్య కళాశాల లేడీస్ హాస్టల్ ఎదురుగా నగ్నంగా నిలబడి సంజ్ఞలు చేసిన ఒక యువకుడిని పోలీసులు అరెస్టు చేశారు. ఫ్లవర్ బజార్ ముత్తుస్వామి వంతెన వద్ద మెడికల్ కాలేజీ లేడీస్ హాస్టల్ ఉంది. ఈ హాస్టల్‌కు ఎదురుగా ఒక యువకుడు నగ్నంగా నిలబడి సైగలు చేశాడు. ఆ యువకుడి చేష్టలను గుర్తించిన విద్యార్థినులు దిగ్భ్రాంతికిగురై వార్డెన్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో వార్డెన్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు. హాస్టల్ సమీపంలోని సీసీ ఫుటేజీ పరిశీలించి అసభ్యంగా ప్రవర్తించిన పోకిరిని అరెస్టు చేశారు. ఈ యువకుడిని స్థానిక కొండితోపు, మునుస్వామి వీధికి చెందిన రవికుమార్(41)గా గుర్తించారు.

## పట్టా మార్పిడికి రూ.వెయ్యి లంచం : వీఏవో అరెస్టు

అడయార్, మే 31: పట్టా మార్పిడికి వెయ్యి రూపాయలు లంచం తీసుకున్న వీఏవోను అవినీతి నిరోధక శాఖ పోలీసులు అరెస్టు చేశారు. ధర్మపురి జిల్లా కడత్తూరు యూనియన్‌కు చెందిన సుధాకర్ (38) అనే రైతు తనకున్న పది సెంట్ల భూమిని మరో మహిళకు విక్రయించాడు. ఈ భూమి పట్టా పేరు మార్చాలని దరఖాస్తు చేసుకున్నారు. అయితే పట్టా పేరు మార్చేందుకు వీఏవో కదిరవన్ లంచం డిమాండ్ చేశాడు. ఈ విషయాన్ని సుధాకర్ ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రంగంలోకి దిగిన ఏసీబీ అధికారులు... సుధాకర్ నుంచి రూ.వెయ్యి లంచం తీసుకుంటున్న కదిరవన్ ను రెడ్‌హ్యాండ్‌గా పట్టుకుని అరెస్టు చేశారు. వీఏవోపై వివిధ సెక్షన్‌లపై కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

## అవయవదాతలకు మూడేళ్లపాటు సాయం

● రాష్ట్రప్రభుత్వానికి హైకోర్టు సూచన

పెరంబూర్, మే 31: అవయవ దానం చేసే వారికి శస్త్రచికిత్స అనంతరం మూడేళ్లు ప్రతినెలా కొంత మొత్తం సాయం అందించేలా చర్యలు చేపట్టాలని రాష్ట్రస్థాయి కమిటీకి మద్రాసు హైకోర్టు ఉత్తర్వులు జారీచేసింది. కిడ్నీ సంబంధిత వ్యాధితో కోయంబత్తూర్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నలుగురికి కిడ్నీలు అందజేసేందుకు కొందరు స్వచ్ఛందంగా ముందుకొచ్చారు. అయిదే వారు రోగులకు దగ్గర బంధువులంటూ కిడ్నీ దానానికి ఆమోదం తెలిపే అవయవ మార్పిడి కమిటీకి ఆసుపత్రి నిర్వాహకులు దరఖాస్తు చేయలేదు. దీంతో, దాతలు తమ కిడ్నీ మార్పిడికి అనుమతి కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. ఈ కేసును శుక్రవారం విచారించిన న్యాయమూర్తి జస్టిస్ జీఆర్ స్వామినాథన్... మానవ శరీర అవయవాల అమ్మకాలు నిరోధించేలా, శరీర అవయవాలు, కణజాలాల మార్పిడి చట్టం రూపొందింది. దగ్గర బంధువులు కాని వారు అవయవ దానం చేయడాన్ని ఈ చట్టం నిషేధించదు. కాగా, రాష్ట్రస్థాయి మంజూరు సంఘం ఆమోదం పొందాలని సూచించింది. ఆసుపత్రులే అవయవదానానికి అనుమతి కోరుతూ దరఖాస్తులు పంపాలని రాష్ట్రస్థాయి కమిటీ పట్టుబట్టకూడదు. దాత, గ్రహీత ఇద్దరూ రాష్ట్రస్థాయి కమిటీకి దరఖాస్తు చేసుకోవచ్చు. అవయవదానంలో వాణిజ్య పరమైన లావాదేవీలు లేకుంటే, రాష్ట్రస్థాయి కమిటీ దానం ఆమోదం కోసం చేసుకున్న దరఖాస్తు తిరస్కరించకూడదు. అయితే ప్రేమ ప్రాతిపదికన దానధర్మాలు చేసేందుకు ప్రభుత్వ తగిన నిబంధనలు రూపొందించాలి. అవయవదానం కోసం వచ్చిన దరఖాస్తులు పరిశీలించి ఆమోదించడంతో రాష్ట్రస్థాయి కమిటీ పని అయిపోలేదు. శస్త్రచికిత్స అనంతరం వైద్య ఖర్చులు భరించేందుకు, అవయవ దాతకు వైద్య బీమా అందించడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలి, మూడు సంవత్సరాల పాటు సహాయంగా నెలనెలా నిర్దిష్ట మొత్తాన్ని చెల్లించాలి అంటూ న్యాయమూర్తి రాష్ట్రస్థాయి కమిటీని ఆదేశించారు.

## మరక్కాణం వద్ద బియ్యం లారీ బోల్తా


భారీ క్రేన్ సాయంతో లారీని తొలగిస్తున్న కార్మికులు

చెన్నై, మే 31 (ఆంధ్రజ్యోతి): దిండివనం సమీపం మరక్కాణం వద్ద బియ్యం బస్తాల లోడుతో వెళుతున్న లారీ అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. చెన్నై నుంచి బియ్యం బస్తాలతో శుక్రవారం ఉదయం పెరంబలూరుకు బయలుదేరింది. ఆ లారీని పెరంబలూరు జిల్లాకు చెందిన మణికంఠన్ (35) నడిపాడు. దిండివనం సమీపం మరక్కాణం వద్ద వెళుతున్న ఆ లారీ అదుపు తప్పి రోడ్డు డివైడర్‌ను ఢీకొని బోల్తాపడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్ మణికంఠన్ సహా ముగ్గురు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని విచారణ జరుపుతున్నారు.

## తిరువళ్ళూర్‌లో యువకుడి హత్య

అడయార్, మే 31: తిరువళ్ళూరు జిల్లాలో ఓ యువకుడు గురువారం రాత్రి దారుణ హత్యకు గురయ్యాడు. ఆ తర్వాత మృతదేహాన్ని చెరువుగట్టుపై పడేశారు. తాజాగా వెలుగులోకి వచ్చిన వివరాలను పరిశీలిస్తే, జిల్లాలోని మోవూరు ప్రాంతానికి చెందిన సతీష్ (28) తల్లిదండ్రులు లేకపోవడంతో మనవాళలర్ నగర్‌లోని తన అక్క ఇంటిలో ఉంటున్నారు. ఆయన పెయింటింగ్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ నేపథ్యంలో సతీష్ అక్క ఇంటికి సమీపంలో జరిగిన ఒక పుట్టిన రోజు వేడుకల్లో అనేక మంది యువకులు పాల్గొన్నారు. ఇందులో సతీష్‌తో పాటు స్నేహితుడు మురళి కూడా పాల్గొన్నారు. ఇందులో పాల్గొన్న పలువురు యువకులు మద్యం సేవించినట్టు సమాచారం. ఈ నేపథ్యంలో శుక్రవారం తెల్లవారుజామున సతీష్ శవమై కనిపించాడు. అతని స్నేహితుడు మురళి కూడా తీవ్ర గాయాలతో ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న మణవాళర్ నగర్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, మురళిని సమీపంలోని ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి విచారణ జరుపుతున్నారు.

## పెయింట్ కర్మాగారంలో అగ్నిప్రమాదం

● ముగ్గురు మృతి

పెరంబూర్, మే 31: తిరువళ్లూర్ సమీపం కాకలూరులోని పెయింట్ కర్మాగారంలో శుక్రవారం సంభవించిన అగ్నిప్రమాదంలో ముగ్గురు మృతిచెందగా, మరో నలుగురికి గాయాలయ్యాయి. ఈ ప్రాంతంలోని కర్మాగారంలో శుక్రవారం మధ్యాహ్నం హఠాత్తుగా మంటలు వ్యాపించాయి. ఆ సమయంలో కర్మాగారంలో పది మంది వరకు పనిచేస్తున్నట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకొని మంటలు అదుపుచేసేందుకు యత్నించారు. కర్మాగారంలో రసాయనాలుండడంతో, దట్టమైన పొగలు అలుముకున్న కారణంగా మంటలు అదుపుచేయడంలో జాప్యం చోటుచేసుకుంది. ఈ ఘటనలో ఒకరి మృతదేహాన్ని అగ్నిమాపక సిబ్బంది వెలికితీశారు. అలాగే, గాయాలతో ఉన్న నలుగురిని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మంటలు అదుపుచేసిన తర్వాత మరో రెండు మృతదేహాలు పూర్తిగా దహనమై కనిపించాయి. కాగా, శిధిలాల కింద మరికొందరు చిక్కుకొని ఉండొచ్చని భావిస్తున్న సిబ్బంది, గాలింపు చర్యలు చేపట్టారు.

## 11 నుంచి కలెక్టర్లతో సీఎస్ సమావేశం

ప్యారీస్, మే 31: లోక్‌సభ ఎన్నికల కోడ్ నిబంధనలు సడలించిన అనంతరం రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శివదాస్ మీనా నాలుగు రోజులు సమీక్షా సమావేశాలు నిర్వహించనున్నట్లు సచివాలయం శుక్రవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది. జూన్ 11,13,15,19 తేదీల్లో నిర్వహించనున్న సమావేశాల్లో కీలక శాఖల పథకాలపై చర్చించనున్నారు. ఈ మేరకు అన్ని జిల్లాల కలెక్టర్లకు పబ్లిక్ రంగ ఉపకార్యదర్శి పద్మజ సర్క్యులర్ జారీ చేశారు. లోక్‌సభ ఎన్నికల ఫలితాల అనంతరం ఎన్నికల కోడ్ నిబంధనలను సడిలిస్తారని, ఆ తర్వాత జిల్లా కలెకర్లతో మండలస్థాయి సమావేశాలను సచివాలయ ప్రాంగణంలోని నామక్కల్ కవాంజర్ మాల్గై 10వ అంతస్తులో సీఎస్ అధ్యక్షతన జరుగుతాయని తెలిపారు. జూన్ 11న చెన్నై, చెంగల్పట్టు, కాంచీపురం, తిరువళ్లూర్, తిరువణ్ణామలై, వేలూరు, తిరుపత్తూర్, రాణిపేట, విల్లుపురం, కళ్లకుర్చి జిల్లాల కలెక్టర్లు, 13న తిరుచ్చి, తంజావూరు, మైలాడుదురై, నాగపట్టణం, తిరువారూర్, అరియలూరు, పెరంబలూరు, పుదుకోట, కడలూరు జిల్లాల కలెక్టర్లతో సీఎస్ సమావేశమవుతారు. 15న సేలం, నామక్కల్, ధర్మపురి, కృష్ణగిరి, కోవై, తిరుప్పూర్, ఈరోడ్, నీలగిరి, కరూర్ జిల్లాల కలెక్టర్లు, 19న మదురై, తిరునల్వేలి, తూత్తుకుడి, కన్నియాకుమారి, రామనాథపురం, విరుదునగర్, తేని, దిండుగల్, శివగంగ, తెన్‌కాశి జిల్లాల కలెక్టర్లతో సమావేశం ఉంటుంది. ఈ నాలుగు సమావేశాలు ఉదయం 9.30 గంటలకు ప్రారంభమవుతాయని, 19 శాఖలకు సంబంధించిన ప్రధాన పథకాలపై కలెక్టర్లతో సీఎస్ చర్చిస్తారని సర్క్యులర్‌లో సూచించారు. మాదకద్రవ్యాల నివారణకు చేపడుతున్న చర్యలు, మహిళలకు వ్యతిరేకంగా జరుగుతున్న నేరాలు, ఎస్సీ, ఎస్టీలకు వ్యతిరేకంగా కొనసాగుతున్న సంఘటనలు, రోడ్ల విస్తరణ, తాగునీటి సరఫరా, పాఠశాలల్లో అల్పాహార పథకం, శ్రీలంక శరణార్థులకు గృహవసతి పథకం తదితర పథకాలకు సంబంధించి సీఎస్ సమీక్షించనున్నారు.

## 900 మంది విద్యార్థుల సమ్మర్ టూర్

ఐసిఎఫ్, మే 31: పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో 900 మంది ప్లస్ వన్ విద్యార్థులు సమ్మర్ టూర్ వెళ్లనున్నారు. ఈ విద్యార్థులకు తరగతులు ప్రారంభించడానికి ముందు రాష్ట్రంలోని పర్యాటక స్థలాలకు తీసుకెళ్లేందుకు పాఠశాల విద్యాశాఖ ఏర్పాట్లు చేపట్టింది. కొల్లిమలై, ఏర్కాడు, కొడైకెనాల్, కుట్రాలం వంటి ప్రాంతాల్లో నాలుగు విభాగాలుగా వేసవి శిక్షణా శిబిరాలు ఐదు రోజుల పాటు జరుగనున్నాయి. వీటిలో ప్లస్ వన్‌లో ఎక్కువ మార్కులు సాధించిన, క్రీడల్లో గెలుపొందిన 900 మంది విద్యార్థులు పాల్గొననున్నారు. వీరి తప్పనిసరిగా తల్లిదండ్రుల ఆమోద పత్రాన్ని తీసుకురావాలని పాఠశాల విద్యాశాఖ సూచించింది.

## విద్యుత్ వినియోగం 9.75 కోట్ల యూనిట్లు

ఐసిఎఫ్, మే 31: నగరంలో విద్యుత్ వినియోగం 9.75 కోట్ల యూనిట్లకు పెరిగినట్లు విద్యుత్ బోర్డు తెలిపింది. సాధారణంగా చెన్నైలో రోజుకు 6 నుంచి 7 కోట్ల యూనిట్లు విద్యుత్ వినియోగం జరుగుతోంది. ఈ ఏడాది ఎండ తీవ్రతతో పాటు ఐపీఎల్ పోటీలు వంటి వాటి వల్ల గత నెల 3వ తేది 9.74 కోట్ల యూనిట్లకు విద్యుత్ వినియోగం పెరిగింది. బుధవారం 9.75 కోట్ల యూనిట్లకు చేరుకుందని అధికారులు తెలిపారు.

## నాలుగు ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌ల అభివృద్ధి

ఐసిఎఫ్, మే 31: నగరంలోని నాలుగు ప్రాంతాల్లో ఫుట్‌పాత్‌ల అభివృద్ధి చేపట్టనున్నట్లు చెన్నై కార్పొరేషన్ తెలిపింది. రహదారి పక్కన ఫుట్‌పాత్‌లు అభివృద్ధి చేసేందుకు కార్పొరేషన్ చర్యలు చేపట్టింది. తొలివిడతగా రతన్ బజార్ అండ్ ఈవినింగ్ బజార్ రోడ్డు, వెప్పేరి హైరోడ్డు, సైడన్‌హామ్స్ రోడ్డు, గాంధీ ఎర్విన్ రోడ్లను ఎంపిక చేసి అభివృద్ధి పనులు చేపట్టనుంది.

## 10న ఆదిద్రావిడ పాఠశాలల టీచర్లకు కౌన్సెలింగ్

ఐసిఎఫ్, మే 31: ఆదిద్రావిడుల పాఠశాలల ఉపాధ్యాయుల బదిలీ కౌన్సెలింగ్ ఈ నెల 10వ తేది జరుగనుంది. 2024-25 విద్యా సంవత్సరం బదిలీ కౌన్సెలింగ్ ఆన్‌లైన్ ద్వారా జరుగనుంది. ఆదిద్రావిడ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని మహోన్నత, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పీజీ టీచర్లు, కంప్యూటర్ టీచర్లు, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్లు (జిల్లా పరిధిలో, ఇతర జిల్లాలకు), మాధ్యమిక, ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు (జిల్లా పరిధిలో మాత్రమే) 10వ తేది ఉదయం 10 గంటలకు బదిలీ కౌన్సిలింగ్ జరుగనుంది.

## 'సమగ్ర శిక్ష' సిబ్బంది పదవీకాలం పొడిగింపు

ఐసిఎఫ్, మే 31: సమగ్ర శిక్షా అభియాన్ సిబ్బంది పదవీకాలం ఆరునెలలు పొడిగించారు. అందరికీ మాధ్యమిక విద్య (సమగ్ర శిక్ష) పథకంలో ఇదివరకే పనిచేస్తున్న ఉన్నత పాఠశాలల్లో 4,393 ల్యాబ్, 1,764 జూనియర్ అసిస్టెంట్లను 2011-12 సంవత్సరంలో నియమించారు. వీరి పదవీకాలం 2024 ఫిబ్రవరి 18 వరకు కాగా, మే 18 వరకు పొడిగించారు. ఈ నేపథ్యంలో, మళ్లీ ఈ గడువును నవంబరు 18వ తేది వరకు పొడిగిస్తూ పాఠశాల విద్య డైరెక్టరేట్ ఉత్తర్వులు జారీ చేసింది.

## రాజ్‌భవన్‌కు బాంబు బెదిరింపు చేసిన వ్యక్తి అరెస్ట్

ఐసిఎఫ్, మే 31: స్థానిక గిండిలో ఉన్న రాజ్‌భవన్‌కు బాంబు బెదిరింపు చేసిన వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. చెన్నై పోలీస్ కంట్రోల్ రూమ్‌కు గురువారం రాత్రి ఫోన్ చేసిన గుర్తుతెలియని వ్యక్తి, రాజ్‌భవన్‌లో బాంబు పేలుతుందని చెప్పి ఫోన్ కట్ చేశాడు. అప్రమత్తమైన పోలీసులు రాజ్‌భవన్‌లో తనిఖీలు నిర్వహించగా, ఎలాంటి పేలుడు పదార్థాలు లభించలేదు. ఈ విషయమై గిండి పోలీసులు కేసు నమోదుచేసి విచారణ జరిపి బాంబు బెదిరింపుకు పాల్పడిన కళ్లకుర్చి సమీపంలోని సూరకోటకు చెందిన దేవరాజ్‌ను అరెస్ట్ చేశారు.

## రూ.30 లక్షల మద్యం స్వాధీనం : నలుగురి అరెస్ట్

ఐసిఎఫ్, మే 31: ఉళుందూర్‌పేట సమీపంలో రూ.30 లక్షల విలువైన మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్న పోలీసులు నలుగురిని అరెస్ట్ చేశారు. పుదుచ్చేరి నుంచి మినీ లారీ, కారులో మద్యం తరలిస్తున్నట్లు కళ్లకుర్చి పోలీసులకు సమాచారం అందింది. దీంతో శుక్రవారం ఉదయం ఉళుందూర్‌పేట సమీపంలోని సెంజికుర్చి టోల్‌గేట్ వాహనతనిఖీలు నిర్వహించారు. ఆ మార్గంలో వచ్చిన లారీ, కారు ఆపేందుకు యత్నించగా ఆపకుండా వెళ్లారు. అనుమానించిన పోలీసులు ఛేజ్ చేసి ఆ రెండు వాహనాలను అడ్డుకున్నారు. ఆ వాహనాల్లో రూ.30 లక్షల విలువైన మద్యం గుర్తించి స్వాధీనం చేసుకొని, పుదుచ్చేరికి చెందిన నలుగురిని అరెస్ట్ చేసి, పరారైన మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు.

## డీఎంకే కార్యకర్తల సమావేశం


సమావేశంలో ప్రసంగిస్తున్న నందకుమార్

వేలూరు, మే 31: డీఎంకే జిల్లా కార్యకర్తల సమావేశం శుక్రవారం ఆ పార్టీ కార్యాలయంలో జరిగింది. సమావేశంలో పాల్గొన్న జిల్లా కార్యదర్శి ఏపీ నందకుమార్ మాట్లాడుతూ... ఈ నెల 4న జరగనున్న ఓట్ల లెక్కింపులో ఏజెంట్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ ఎన్నికల్లో డీఎంకే కూటమి 40 స్థానాలు కైవసం చేసుకుంటుందని తెలిపారు. అలాగే, ఈ నెల 3వ తేది దివంగత మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి శతజయంతి వేడుకలు జిల్లా వ్యాప్తంగా నిర్వహించి, ప్రజలకు సంక్షేమ సహాయాలు పంపిణీ చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో జిల్లా అవై అధ్యక్షుడు మహమ్మద్ సకీ, వేలూరు మా నగర సెక్రటరీ, ఎమ్మెల్యే కార్తికేయన్, ఎంపీ కదిర్ ఆనంద్, గుడియాత్తం ఎమ్మెల్యే అమ్ములు, కార్పొరేషన్ మేయర్ సుజాత సహా పలువురు నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైభవంగా గంగమ్మ శిరస్సు వేడుకలు



వేలూరు, మే 31: కాట్పాడి డివిజన్ జాఫర్‌పేటలో శుక్రవారం గంగమ్మ శిరస్సు వేడుకలు వైభవంగా జరిగాయి. ఉదయం ఉత్సవ మూర్తి గంగమ్మకు అభిషేకం, అలంకారం, మహా దీపారాధన నిర్వహించారు. అనంతరం అమ్మవారి శిరస్సుకు ప్రత్యేక అలంకారం చేసి ఊరేగించారు. భక్తులు దీపారాధన చేసి, అంబళ్లు పోసి మొక్కులు తీర్చుకున్నారు. వేడుకల్లో పాల్గొన్న భక్తులకు ఆలయ నిర్వాహకులు అన్నదానం చేశారు.

## ఆధార్ కార్డు ప్రత్యేక శిబిరం


తపాలా శాఖ ఆధ్వర్యంలో ఆధార్ శిబిరం

వేలూరు, మే 31: కార్పొరేషన్‌లోని 47వ వార్డు సలవన్ పేట పరిధిలోని మరకదనగర్, గణపతి నగర్ ప్రాంతాల్లో తపాలా శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక ఆధార్ శిబిరం జరిగింది. శిబిరంలో వంద మందికి పైగా పాల్గొని ఆధార్ నమోదుచేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఎస్.ఎయిల్అరసన్ సహా పలువురు నేతలు, అధికారులు పాల్గొన్నారు.

## రోగి బంధువులకు ఉచిత భోజన వసతి


భోజనం అందజేస్తున్న దినేష్ శరవణన్

వేలూరు, మే 31: చికిత్స కోసం వచ్చిన రోగి బంధువులకు సమాజ సేవకుడు దినేష్ శరవణన్ భోజనం అందజేశారు. తిరుచ్చిలో గువ్వల సముదాయానికి చెందిన మహిళ క్యాన్సర్ గడ్డ తొలగించుకొనేందుకు తిరుచ్చి ప్రభుత్వాసుపత్రికి వెళ్లగా, అక్కడ తగిన సౌకర్యాలు లేవని చెన్నై పంపించారు. అక్కడ వైద్యులు, క్యాన్సర్ నరిచేందుకు వీలుకాదని చెప్పడంతో వారు స్థానిక ప్రైవేటు ఆస్పత్రికి వచ్చారు. బాధిత మహిళతో పాటు ఆమె బంధువులు 17 మంది రాగా, వారుండేందుకు బస సౌకర్యం, భోజనం లేక ఇబ్బందులు పడుతున్నారు. సమాచారం తెలుసుకున్న సమాజ సేవకుడు దినేష్ శరవణన్ వారికి బస ఏర్పాటుచేయడంతో పాటు భోజన వసతి కల్పించారు.

# చిత్రజ్యోతి

## నేడు 'ఇండియన్-2' ఆడియో గ్రాండ్ రిలీజ్



వినూత్నంగా ఆడియో రిలీజ్ ఇన్విటేషన్

విశ్వనటుడు కమల్ హాసన్ - సెన్సేషనల్ డైరెక్టర్ ఎస్.శంకర్ కాంబినేషన్‌లో తెరకెక్కిన 'ఇండియన్-2' చిత్రం ఆడియో శనివారం రిలీజ్ చేస్తున్నారు. ఇందుకోసం పెరియమేట్‌లోని నెహ్రూ ఇండోర్ స్టేడియంలో భారీ ఏర్పాట్లు చేశారు. శనివారం సాయంత్రం 6 గంటల నుంచి ఆడియో రిలీజ్ వేడుక ప్రారంభంకానుంది. ఇందులో సూపర్ స్టార్ రజనీకాంత్ ముఖ్య అతిథిగా పాల్గొంటారన్న ప్రచారం సాగింది. కానీ, ఆయన హిమాలయాల పర్యటనకు వెళ్ళారు. అయితే, మలయాళ సూపర్ స్టార్లు మమ్ముట్టి, మోహన్‌లాల్, టాలీవుడ్ మెగా స్టార్ చిరంజీవి, కన్నడ స్టార్ శివరాజ్ కుమార్, విజయ్‌సేతుపతి తదితర అగ్ర నటులు ఈ వేడుకకు హాజరుకానున్నారు. ఇదిలావుండగా ఈ ఆడియో రిలీజ్ వేడుకకు ముద్రించిన ఆహ్వాన పత్రిక ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ చిత్రంలో కమల్ హాసన్ పోషించిన సేనాధి పాత్ర ఫొటోతో పాటు కత్తి ఉన్న ఫొటోలను ముద్రించారు. అలాగే, ఆడియో రిలీజ్ వేడుకలో అనేక ఆశ్చర్యకర అంశాలను వెల్లడించనున్నారు. ముఖ్యంగా ఈ చిత్ర హీరో కమల్ హాసన్ వృద్ధ సేనాధిపతి వేషంలో హాజరుకానున్నట్టు తెలుస్తుంది.

## ఆకట్టుకుంటున్న విజయ్ సేతుపతి 'మహారాజా' ట్రైలర్



'మహారాజా'లో విజయ్ సేతుపతి

నిఖిలన్ స్వామినాథన్ దర్శకత్వంలో విజయ్ సేతుపతి, మమతా మోహన్‌దాస్, అనురాగ్ కష్యప్, నట్టి నటరాజ్, భారతీరాజా, అభిరామి, మునీష్ కాంత్ తదితరులు నటించిన చిత్రం 'మహారాజా'. విజయ్‌సేతుపతి నటిస్తున్న 50వ చిత్రం ట్రైలర్‌ను తాజాగా రిలీజ్ చేశారు. ఇందులో బార్బర్ షాపు నడిపే విజయ్ సేతుపతి తన లక్ష్మి కనిపించడం లేదని పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేస్తారు. అది లక్ష్మినా? భార్యనా? లేక కుమార్తెనా? లేక డబ్బా? అని పోలీసులు విజయ్ సేతుపతిని అడగ్గా లేదని సమాధానం చెబుతాడు. ఇపుడు విజయ్ సేతుపతి ఫిర్యాదు చేసినట్టుగా కనిపించకుండా పోయింది ఏంటి? అన్నది సస్పెన్స్‌తో ఈ ట్రైలర్ కట్ చేశారు. ప్రస్తుతం ఈ ట్రైలర్ సోషల్ మీడియాలో వైరల్ అయింది.

## త్వరలోనే పెళ్ళిపీటలెక్కనున్న నటుడు ప్రేమ్‌జీ



తమిళ నటుడు ప్రేమ్‌జీ త్వరలోనే పెళ్ళిపీటలెక్కనున్నారు. వివాహ ఆహ్వాన పత్రికను ఆయన సోషల్ మీడియాలో షేర్ చేశారు. ఇందు అనే యువతిని వివాహం చేసుకోనున్నట్టు ప్రకటించారు. కోలీవుడ్‌లో మల్టీటాలెంటెడ్‌గా గుర్తింపు పొందిన ప్రేమ్‌జీ దర్శకుడు వెంకట్ ప్రభుకు సోదరుడు. సీనియర్ సంగీత దర్శకుడు గంగై అమరన్ కుమారుడు. ప్రేమ్‌జీ సంగీత దర్శకుడిగా, దర్శకుడిగా, పాటల రచయితగా ఇలా మల్టీ టాలెంటెడ్‌గా కొనసాగుతున్నారు. అయితే, ప్రేమ్‌జీ వివాహం గురించి సుదీర్ఘకాలంగా చర్చ సాగుతుంది. గతంలో కూడా ఓ యువతిని ప్రేమిస్తున్నట్టు వార్తలు కూడా వచ్చాయి. అయితే, అవన్నీ కేవలం పుకార్లేనని ప్రేమ్‌జీ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో జూన్ 9వ తేదీ ఇందు అనే యువతిని తిరువళ్ళూరులోని మురుగన్ ఆలయంలో వివాహం చేసుకోనున్నట్టు అధికారికంగా వెల్లడించారు.

## కన్నియాకుమారిలో 'అల'జడి



కన్నియాకుమారిలో ఎగసిపడుతున్న అలలు

చెన్నై, మే 31 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ పర్యాటక ప్రాంతం కన్నియాకుమారిలో శుక్రవారం ఉదయం అలలు తీరం వైపు దూసుకువచ్చాయి. గత కొద్ది రోజులుగా కన్నియాకుమారి జిల్లా అంతటా చెదురుమదురుగా వర్షాలు కురిశాయి. ఈ నేపథ్యంలో అరేబియా సముద్రంలో ప్రస్తుతం అల్పపీడనం కేంద్రీకృతమై ఉండటంతో కన్నియాకుమారి త్రివేణి సంగమ ప్రాంతం వద్ద అలలు 10 నుంచి 15 అడుగుల ఎత్తున తీరం వైపు ఎగసిపడుతున్నాయి. అలల నిరోధక గోడ దాటుకుని అలలు దూసుకువస్తున్నాయి. నీరోడి నుంచి పొయియూరు దాకా ఉన్న తీర గ్రామాల రహదారిలో వాహనాల రాకపోకలు కూడా స్తంభించాయి. దీంతో సముద్రతీర గ్రామాల్లో నివసిస్తున్నవారంతా ఆందోళన చెందుతున్నారు. ఉదయం 11 గంటల సమయంలో పెనుగాలులు వీయడంతో సముద్రంలో అలలు ఉవ్వెత్తున ఎగసిపడ్డాయి.



చెన్నై రెట్టేరి సిగ్నల్ కొళత్తూర్ ప్రాంతాల్లో 'అంతర్జాతీయ పొగాకు ఉత్పత్తుల నిరోధక దినం' సందర్భంగా ప్రజలకు పొగాకు ఉత్పత్తుల అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న చెన్నై కార్పొరేషన్ ఆరోగ్యశాఖ సిబ్బంది





← ఏనుగు షవర్ బాత్ - కుంటలో నింపిన నీటితో సేదతీరుతున్న గొరిల్లాలు

ఎండవేడి నుంచి ఉపశమనం కోసం...

## జూలో జంతువుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు



నీటిలో సేదతీరుతున్న తెల్లపులి



నీటిలో కొంగల జలకాలు

పెరంబూర్, మే 31: స్థానిక వండలూరు జూ పార్క్‌లో ఎండ వేడి నుంచి జంతువులను రక్షించేలా పార్క్ యాజమాన్యం ప్రత్యేక ఏర్పాట్లు చేపడుతోంది. ఆగ్నేయాసియా పరిధిలో అతిపెద్ద జూ పార్క్ అయిన అరింజర్ అన్నా జులాజికల్ పార్క్ 1855లో 602 హెక్టార్ల విస్తీర్ణంలో ఏర్పాటు చేశారు. ఈ పార్క్‌లో 475 రకాల జంతు జాతులు, 46 రకాలకు సరీసృపాలు, పక్షులు మొత్తం 2,644 సంరక్షిస్తున్నారు. ప్రస్తుతం ఎండ తీవ్రత అధికంగా ఉండడంతో జంతువులు, పక్షులు అల్లాడుతున్నాయి. వాటికి ఉపశమనం కల్పించడంతో పాటు పోషకాహారాలు కూడా పార్క్ అధికారులు అందిస్తున్నారు. ప్రస్తుతం నగరంలో సుమారు 41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఎండ వేడి కారణంగా పార్క్‌లోని చిన్న నీటికుంటలు కూడా ఎండిపోయాయి. దీనిపై దృష్టి సారించిన యాజమాన్యం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఏనుగులకు షవర్ బాత్ ఏర్పాటు, పులులు, ఎలుగు బంట్లు, గొరిల్లా సహా ఇతర జంతువులపై పైపు ద్వారా నీరు చల్లడం లాంటి ఏర్పాట్లు చేపట్టారు. అలాగే, పక్షులుండే బోనులపై కూడా ఉదయం, సాయంత్రం నీరు పిచికారీ చేస్తున్నారు. అలాగే, నీటి కుంటల్లో నీరు నింపుతుండడంతో, జంతువులు వాటిలో దిగి సేదతీరుతున్నాయి. అలాగే, ఎండ వేడికి గురయ్యే జంతువులకు చికిత్స అందించేందుకు పశు వైద్యులను కూడా సిద్ధంగా ఉంచారు.



నీటి కుంటలో ఏనుగులు



చింపాంజీపై నీరు పిచికారీ

## చెన్నై శిశువు కోసం విమానంలో వచ్చిన గుండె

చెన్నై, మే 31 (ఆంధ్రజ్యోతి): కోయంబత్తూరులో మెదడు నిర్జీవమైన 11 నెలల పసికందు గుండెను చెన్నైలో యేడాది ఆడశిశువుకు అమర్చేందుకు వైద్యనిపుణులు విమానంలో సకాలంలో తీసుకువచ్చారు. కోవై చిన్నారి గుండెను చెన్నై శిశువుకు వైద్యనిపుణులు శస్త్రచికిత్స ద్వారా అమర్చారు. దీంతో ఆ శిశువు ప్రాణగండం నుండి బయటపడింది. కోయంబత్తూరులో శరవణన్ అనే ప్రైవేటు ఆస్పత్రి నర్సుకు 11 నెలల క్రితం ఆడ శిశువు జన్మించింది. అధిరా అనే పేరుగల ఆ శిశువు వారం రోజుల క్రితం ఇంటిలో బల్లపై నుండి జారి నేలపై పడి తీవ్రంగా గాయపడింది. వెంటనే ఆమెను చికిత్స నిమిత్తం కోయంబత్తూరులోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. నాలుగు రోజులపాటు చికిత్స చేసినా ప్రయోజనం లేక ఆ శిశువు మెదడు నిర్జీవమైంది. ఈ విషయం తెలుసుకుని తల్లిదండ్రులు విలపించగా, వైద్యులు, బంధువులు ఓదార్చారు. ఆ తర్వాత తమ బిడ్డ అవయవాలను దానం చేసేందుకు తల్లిదండ్రులు అంగీకరించారు. దీంతో వైద్యులు ఆపరేషన్ చేసి ఆ శిశువు గుండె, కిడ్నీలను తొలగించి భద్రపరిచారు. ఆ తర్వాత చెన్నైలోని ప్రైవేటు ఆసుపత్రిలో యేడాది వయస్సున్న బాలిక గుండె మార్పిడి చికిత్స కు సిద్ధంగా ఉన్నట్లు తెలుసుకుని కోయంబత్తూరు చిన్నారి గుండెను ఆమెకు అమర్చాలని వైద్యులు నిర్ణయించారు. ఆ మేరకు కోయంబత్తూరు నుంచి గుండెను చెన్నై తీసుకువచ్చారు. ఆలస్యం చేయకుండా వైద్యులు ఆపరేషన్ చేసి కోవై శిశువుకు చెందిన గుండెను చెన్నై చిన్నారికి అమర్చారు. శస్త్ర చికిత్స తర్వాత ఆ చిన్నారి కోలుకున్నట్లు వైద్యులు ప్రకటించారు.



చిన్నారి గుండెను భద్రపరచిన పెట్టెను తీసుకెళ్తున్న వైద్య సిబ్బంది

## పైకారా జలపాతంలో నీటి ప్రవాహం



చెన్నై, మే 31 (ఆంధ్రజ్యోతి): నీలగిరి జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతం ఊటీలోని పైకారా జలపాతం వద్ద ప్రస్తుతం ఉధృతంగా జలధారలు పడుతుండటంతో పర్యాటకులు ఆసక్తిగా వీక్షిస్తున్నారు. 61 మీటర్ల ఎత్తుకలిగిన ఆ జలపాతంలో విద్యుదుత్పత్తి కూడా జరుగుతోంది. విద్యుత్ ఉత్పత్తి సమయంలో పైకారా డ్యామ్ నుంచి నీరు విడుదల చేసినప్పుడల్లా ఈ సరస్సు జలకళ సంతరించుకుంటుంది. ప్రస్తుతం ఆ డ్యామ్ వద్ద విద్యుత్ ఉత్పత్తి అధికంగా జరుగుతుండటంతో పైకారా సరస్సులో వరద దృశ్యాలు నెలకొన్నాయి. ఆ జలపాతంలో పొంగి ప్రవహిస్తున్న జలాలను గత రెండు రోజులుగా పర్యాటకులు వీక్షించి ఆనందిస్తున్నారు.

## బేరిజం కొలను ప్రాంతంలో సందర్శకులకు నిషేధం

పెరంబూర్, మే 31: దిండుగల్ జిల్లా కొడైకెనాల్‌లో పర్యాటక స్థలమైన బేరిజం కొలను సమీపంలో అడవి ఏనుగులు మకాం వేయడంతో పర్యాటకులు ఆ ప్రాంతానికి వెళ్లకుండా అటవీ శాఖ నిషేధం విధించింది. నిబంధనలు అతిక్రమించి ఆ ప్రాంతానికి వచ్చిన పర్యాటకులను అటవీ సిబ్బంది హెచ్చరించి వెనక్కి పంపిస్తున్నారు. ఏనుగుల సంచారాన్ని 24 గంటలు పర్యవేక్షిస్తున్నట్లు, ఈ ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి ఏనుగుల గుంపు వెళ్లిన తర్వాత, పర్యాటకులను అనుమతిస్తామని అటవీ శాఖ అధికారులు తెలిపారు.



పర్యాటకులను పంపించి వేస్తున్న అటవీ సిబ్బంది (పక్క చిత్రంలో) బేరిజం ప్రాంతంలో మకాం వేసిన ఏనుగులు

శుక్రవారం రాజ్‌భవన్‌లో జరిగిన గోవా, సిక్కిం రాష్ట్రాల ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలను వీక్షిస్తున్న రాష్ట్ర గవర్నర్ ఆర్ఎన్ రవి తదితరులు

